
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

ఆదివారం 1 జూన్ 2025

అన్ని రేషన్‌షాపులకు సన్నబియ్యం స్టాక్‌ను చేర్చాలి

ఎంఎల్‌ఎస్ సిబ్బందికి కలెక్టర్ ఆదేశం

సిద్దిపేట కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం స్టాక్‌ను అన్ని రేషన్‌షాపులకు త్వరగా చేరవేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శనివారం ఆయన సిద్దిపేట మార్కెట్ యార్డులోని మండల లెవెల్ స్టాక్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడి నుంచి మండలాల్లోని రేషన్ దుకాణాలకు లారీల ద్వారా సరఫరా అవుతున్న తీరును పరిశీలించారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్‌షాపులకు తరలించే బియ్యం పరిమాణం, ఎన్ని రోజుల సమయం పడుతుంది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం సరఫరా చేయుటకు సరిపడా వాహనాలు సమకూర్చి, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా అన్ని షాపుల్లో బియ్యం ఉండేలా చూసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ప్రవీణ్‌ను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీవో సదానందం తదితరులు ఉన్నారు.



ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో స్టాక్ రికార్డ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

రేపటి 'ప్రజావాణి' రద్దు

సిద్దిపేట కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు వేస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా జూన్ 2 (సోమవారం) ప్రజావాణి నిర్వహించడం లేదని పేర్కొన్నారు. జూన్ 9 జరిగే ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఫోకస్

చెరువు మట్టి..

కొల్లగొట్టి

గణపతికుంటలో దర్జాగా తవ్వకాలు

- రైతుల పేరిట పొలానికి అనుమతి..
- వ్యవసాయేతర భూములకు తరలింపు
- టిప్పర్ మట్టి రూ.6 వేలకు వరకు విక్రయం
- రెండు రోజులుగా ఇదే తంతు

సిద్దిపేట పట్టణంలోని గణపతి కుంటలో ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి టిప్పర్‌లలో తరలిస్తున్న దృశ్యం



మిట్టపల్లిలోని రోడ్డు కోసం కుంట మట్టిని డంపు చేస్తున్న టిప్పర్

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 31 : రైతులు సాగు చేసే వ్యవసాయభూమిలో చెరువు మట్టిని ఉపయోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశాన్ని కల్పించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న పలువురు నాయకులు, వ్యాపారులు రైతుల పేరు చెప్పి జిల్లాలో మట్టి దందాను నిర్వహిస్తున్నారు. చెరువుల నుంచే కాకుండా ప్రభుత్వ భూములకు చెందిన స్థలాల్లో యథేచ్ఛగా ఎర్రమట్టిని తోడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. సిద్దిపేట పట్టణంలోని గణపతికుంటలో దర్జాగా పాగా వేసి ఇక్కడి మట్టిని విచ్చలవిడిగా అమ్ముకుంటున్నారు. ఇదేంటనే అడిగేవారు లేకపోవడంతో వారి వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతున్నది. సంబంధిత శాఖలకు చెందిన అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తున్నది.

ఎనిమిది ఎకరాల్లో గణపతికుంట

సిద్దిపేట 7వ వార్డు శివారులో 8 ఎకరాల మేర గణపతికుంట ఉంది. ఈ కుంటను గతంలో గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నించడంతో, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, ఆక్రమణలను కూల్చివేశారు. ఇదిలాఉండగా ఇటీవల ఆ కుంట మట్టిపై కన్నేసిన నేతలు, వ్యాపారులతో కలిసి మట్టి దందాకు తెరలేపారు. పలువురు రైతులకు చెందిన పాస్‌బుక్కులను ఎరగా వేసి కుంట మట్టిని వ్యవసాయ భూములకు తరలిస్తామని చెప్పి అనుమతి తీసుకున్నట్లు సమాచారం. తీసుకున్న అనుమతి గోరంత అయితే అక్కడ

మిగతా 8వ పేజీలో

'ఆంధ్రజ్యోతి' ఆరా

పట్టణంలోని గణపతికుంట నుంచి మట్టిని లోడ్ చేసుకున్న టిప్పర్‌లు ఎక్కడికి వెళ్తున్నాయని 'ఆంధ్రజ్యోతి' ఆరా తీసింది. పలు టిప్పర్‌ల వెంబడి వెళ్లగా ఓ టిప్పర్ సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలోని ఓ రోడ్డు కోసం కాగా, మరో టిప్పర్ వాహనం సిద్దిపేట పట్టణంలోని నూతన గృహం వద్ద అన్‌లోడింగ్ చేసింది. దీంతో వ్యవసాయేతర పనులకు చెరువు మట్టిని ఉపయోగిస్తున్నట్లు తేటతెల్లమైంది. ఈ విషయమై సంబంధిత ఇరిగేషన్ శాఖకు చెందిన అధికారిని వివరణ కోరగా ఇద్దరు రైతులకు కుంట మట్టి కావాలని కలెక్టరేట్ కార్యాలయం నుంచి అనుమతి తీసువరావడంతో పర్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఆ రైతులు కూడా రెండు వాహనాల్లో మాత్రమే తరలించినట్లు ఫొటోలు కూడా పంపారని చెప్పడం కొసమెరుపు.



సిద్దిపేటలోని ఓ ఇంటి వద్ద కుంట మట్టిని డంపు చేస్తున్న టిప్పర్

మున్సిపల్ పదోన్నతుల్లో మినిస్ట్రీరియల్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

- మున్సిపల్ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్



మాట్లాడుతున్న ప్రభాకర్‌యాదవ్

గజ్వేల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పదోన్నతుల్లో మినిస్ట్రీరియల్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌యాదవ్, , ప్రధాన కార్యదర్శి వెంకటగోపాల్ ఆవేదన వ్యక్తంచేశారు. గజ్వేల్ పట్టణంలో శనివారం నిర్వహించిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు. సీడీఎంఏలో కొంత మంది అధికారులు మున్సిపల్ ఉద్యోగులకు, కిందిస్థాయి సిబ్బందికి అన్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఏళ్లుగా క్లాస్-4 ఎంప్లాయాస్, వార్డు ఆఫీసర్లు మున్సిపాలిటీల్లో పనిచేస్తూ వేతనాలు ఎంపీడీవోలు, పంచాయతీరాజ్‌లలో తీసుకుంటున్నారన్నారు. 1959లో ఏర్పడిన జీవో పైనే మున్సిపల్ మినిస్ట్రీరియల్ పదోన్నతులు జరుగుతున్నాయన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం రాష్ట్రస్థాయి క్యాడర్ ఉద్యోగులు లోకల్ క్యాడర్‌లోకి రావడానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. డీఎంఏ కార్యాలయంలో ముసాయిదా జాబితా లేకుండా అనుకూలంగా ఉన్నవారికి పదోన్నతులు కల్పిస్తూ ఆయా జీవోలను తుంగలో తొక్కుతున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేసే సిబ్బందికి ఇప్పటివరకు సర్వీస్ రూల్స్ రూపొందించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగుల సమస్యలను వినడానికి త్రిమెన్ కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే డీఏలు, పెండింగ్‌లోఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరారు.

సింగారం గ్రామపంచాయతీపై అస్పష్టత

గజ్వేల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామమైన సింగారం తిప్పారం గ్రామ పంచాయతీ మధిర గ్రామంగా ఉంది. ఇటీవల పంచాయతీరాజ్ ఎన్నికల ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా తిప్పారం పంచాయతీ ర్యాండమైజేషన్‌ను నిర్వహించిన అధికారులు సింగారంకు సంబంధించిన ఎలాంటి ప్రక్రియను జరుపలేదు. అంతేకాకుండా ఇటీవల పంచాయతీరాజ్ అధికారులు ప్రభుత్వానికి రాసిన లేఖలో మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్, వేములఘాట్, లక్ష్మాపూర్, రాంపూర్, పల్లెపహాడ్, బ్రహ్మణ బంజేరుపల్లి, కొండపాక మండలం ఎర్రవల్లి గ్రామపంచాయతీలను నేరుగా విలీనం చేసేందుకు ప్రతిపాదించింది. ఈ క్రమంలో తిప్పారం గ్రామపంచాయతీ కుకునూరుపల్లి మండలంలో ఉండడం, తిప్పారం పరిధిలో సింగారం మధిర గ్రామం ఉండడంతో అందుకు సంబంధించిన అంశంపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. ఇటీవల మున్సిపాలిటీకి ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన చెత్తసేకరణ అంశాన్ని అప్పగించిన ప్రభుత్వం సింగారం విషయంపై ఎలాంటి స్పష్టత లేదు. తిప్పారంలోనే ట్రాక్టర్ ఉండడంతో సింగారంలో ఇంటింటి చెత్త సేకరణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

క్రికెట్ స్టేడియంలో రాష్ట్ర అవతరణ వేడుకలు

- ప్రతీ ఏడాది డిగ్రీ కళాశాల మైదానంలో..
- ఈ ఏడాది ఎగ్జిబిషన్ కోసం కిరాయికి
- దీంతో పక్కనే ఉన్న స్టేడియంలో నిర్వహణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 31 : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఈ ఏడాది క్రికెట్ స్టేడియంలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రతీ ఏడాది జూన్ 2న సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను నిర్వహించేవారు. కాగా, ఇటీవల ఆ మైదానంలో ప్రైవేట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. చేసేది లేక మైదానం పక్కనే ఉన్న స్టేడియంలో అవతరణ వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. పచ్చని స్టేడియంలో మధ్యలో గద్దె నిర్మాణం చేపట్టడంతో పాటు వాటర్ ప్రూఫ్ షెడ్డు, పెండల్స్ వేస్తుండటంతో మైదానం పాడైపోతున్నదని క్రీడాకారులు, పలు అసోసియేషన్‌లకు చెందిన నాయకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కాగా, రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఉన్నప్పటికి డిగ్రీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ కిరాయి డబ్బుకు ఆశపడి, మైదానాన్ని అప్పగించడం బాధ్యతారాహిత్యమేనని క్రికెట్ అసోసియేషన్, సిద్దిపేట జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ మండిపడ్డారు. కీడాకారుల కోసం ఉన్న చక్కటి స్టేడియాన్ని పాడుచేయడం తగదన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

రాష్ట్ర అవతరణ వేడుకలను నిర్వహించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్ పక్కన గల క్రికెట్ స్టేడియాన్ని శనివారం కలెక్టర్ ఎం.మనుచౌదరి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి వచ్చే ముఖ్య అతిథులు, అమరవీరుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు తదితరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పగడ్బందీగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను సూచించారు.



సిద్దిపేట పట్టణంలోని క్రికెట్ స్టేడియంలో అవతరణ వేడుకల కోసం చేస్తున్న ఏర్పాట్లు

దొడ్డుబియ్యం గతేమిటి?

ఇంకా రేషన్ దుకాణాల్లోనే మిగులు బియ్యం.. పందికొక్కులు, ఎలుకల పాలు



దుబ్బాకలోని ఓ రేషన్‌షాపులో దొడ్డుబియ్యం

దుబ్బాక, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిర్లక్ష్యంతో దొడ్డుబియ్యం ఇప్పుడు పందికొక్కులు.. ఎలుకలకు ఆహారంగా మారింది. సన్నబియ్యం పంపిణీ కంటే ముందు రెండు నెలల క్రితం రేషన్‌షాపులకు దొడ్డుబియ్యం స్టాక్‌ను చేర్చగా, అందులో పంపిణీ చేసినవి పోగా మిగులు బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు తిరిగి గోదాముకు తరలించలేదు. రేషన్ దుకాణాలల్లోనే ఒక మూలన పడేయడంతో వాటికి కొక్కుపురుగులు, పందికొక్కులు, ఎలుకలు సంచులకు రంధ్రాలు చేస్తూ, బియ్యం బొక్కుతున్నాయి, జిల్లాలో 684 రేషన్‌దుకాణంలో గతంలో ప్రతీ నెల రేషన్ దుకాణాలల్లో దొడ్డుబియ్యం సుమారు 5,700 మెట్రిక్ టన్నుల పైచిలుకు బియ్యం సరఫరా చేసింది. ప్రతీ నెల తప్పకుండా రేషన్‌దుకాణాలల్లో బియ్యం మిగిలేవి. ఈ బియ్యంను ఇండెంట్ రూపంలో రేషన్‌దుకాణాల వారు చూపిస్తే, మిగతా కోటాను మళ్లీ రేషన్‌దుకాణాలకు చేర్చేవారు. అయితే, రెండు నెలల నుంచి సన్నబియ్యం సరఫరా చేయడంతో అంతకు ముందు రేషన్‌దుకాణాలల్లో మిగిలిన సుమారు 550 మెట్రిక్ టన్నులు మిగులు బియ్యంను తిరిగి గోదాంలకు చేర్చాల్సిందిగా ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలను జారీ చేయలేదు. గతంలో ఇలానే కందిపప్పును పంపిణీ చేసి నిలిపివేసిన సమయంలో మిగిలిన పప్పు పాడైపోయింది. దీంతో వంద రూపాయల విలువైన కిలో కందిపప్పును టెండర్‌ద్వారా రూ.20కే అప్పగించారు. గత అనుభవాన్ని చూసైనా ప్రభుత్వం ప్రజాధనంను పందికొక్కులు మేయకుండా చూడకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అన్నీ గుమ్మం వద్దకే..



డెలివరీ బాయ్ నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన వస్తువును తీసుకుంటున్న వ్యక్తి

సండే స్పెషల్

Sunday Special

- ఒక్కక్లిక్‌తో ఇంటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్
- జిల్లాలో విస్తరిస్తున్న ఈ కామర్స్ సేల్స్
- నిత్యావసర వస్తువులు, తినుబండారాలు సైతం ఆర్డర్
- ప్రతీ రోజు లక్షల్లో వ్యాపారం.. యువతకు ఉపాధి

7



పల్లెల్లో నేడు ప్రగతి విలవిల

- నాడు అభివృద్ధి పరుగులు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందని, 18 నెలలుగా ప్రగతి విలవిలాడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో చిన్నకోడూరు, నంగునూరు మండలాల గ్రామాల అభివృద్ధిపై ఆయన శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా అభివృద్ధిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి నెలనెలా రూ.275 కోట్లు ఏటా రూ.3339 కోట్లు వెచ్చించారని గుర్తుచేశారు. నేడు పల్లెల్లో పారిశుధ్యం లోపించి చెత్తకుప్పలుగా, మరోవైపు పంచాయతీలు అప్పులకుప్పగా మరాయన్నారు. సిద్దిపేట నియోజకవర్గం అంటేనే ఆదర్శ గ్రామాలకి, అవార్డులకి పెట్టింది పేరు అని గుర్తుచేశారు. పల్లెలో అభివృద్ధిని కొనసాగించేందుకు సమన్వయంతో పనిచేయాలని, నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకరావాలని చెప్పారు. నూతనంగా ఎన్నికైన పద్మశాలి సమాజం కార్యవర్గాన్ని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు కలిసి అభినందించారు. చేనేత టవల్స్‌తో వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.రాత్రి హరీశ్‌రావు పట్టణంలోని కోమటిచెరువు వద్ద ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో నిర్వహించిన శ్రీహరి పదార్చన శ్రీనివాసుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు..

కుకునూరుపల్లి/సిద్దిపేట రూరల్/నంగునూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ చేసిన సందర్భంగా హరీశ్‌రావు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణం ఒకటో వార్డు లింగారెడ్డి పల్లెలో గ్రామ దేవతల ప్రతిష్ఠ ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. సిద్దిపేటరూరల్ మండలం రాఘవాపూర్‌లో, నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన విద్యుత్ శాఖలో పనిచేస్తున్న రంగు మల్లేశంగౌడ్ కుమారుడు రాహుల్‌గౌడ్ కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా హరీశ్‌రావు శనివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.



సిద్దిపేట రూరల్ మండలం రాఘవపూర్‌లో గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో హరీశ్‌రావుకు తిలకం దిద్దుతున్న మహిళ

కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరం



మృతుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న హరీశ్‌రావు

కోహెడ, మే 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కుటుంబపెద్దని కోల్పోవడం బాధాకరమని, వారి మృతి తీరని లోటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బస్వాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో కలిసి ఆయన పరామర్శించారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తున్న వ్యాన్, ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడెం సారయ్య, బండోజు గణేష్ మృతి చెందారు. వారి కుటుంబాలకు బీఆర్‌ఎస్ తరఫున రూ.5 లక్షల చెక్కును శనివారం హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఇరువురి కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

మొక్కలు నాటేదెప్పుడో..!

- జనగామ-సిద్దిపేట రోడ్డు విస్తరణ పనుల్లో కనుమరుగైన 341 భారీ వృక్షాలు
- నిలువ నీడ కరువు
- ప్రయాణికుల ఇబ్బందులు
- చెట్టు నరికివేతతో ఆనవాళ్లు కోల్పోయిన మర్రిముస్త్యాల గ్రామం
- రోడ్డు పనులు పూర్తయినా మొక్కల పెంపకంపై కానరాని చర్యలు

8



మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు కవిత ఎందుకు మాట్లాడలే?

- ఇప్పుడు సామాజిక తెలంగాణ అనడం విడ్డూరం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

7



పొదల్లో నవజాత శిశువు మృతదేహం

పటాన్‌చెరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : కళ్లు తెరవకముందే రాళ్లమధ్య పొదల్లో ఓ నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయి లభ్యమైన హృదయ విధారక సంఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఇంద్రేశం గ్రామంలో చోటుచేసుకుంది. ఇంద్రేశం గ్రామశివారు లోని గుప్తహిల్స్ కాలనీలో శనివారం ఉదయం నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత ఆడ శిశువుకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. శిశువు మృతికి కారకులను గుర్తించేం దుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం శిశువు మృతదేహాన్ని ఎండీఆర్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థకు అప్ప గించడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

అక్రమ తవ్వకాలను
అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

శివ్వంపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల బాయన్న చెరువులో అక్రమ తవ్వకాలను రెవెన్యూ సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. చెరువులో నిబంధనలకు విరు ద్ధంగా కొందరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడి గురువారం రాత్రి మట్టి తవ్వకాలు నిర్వహించి సంగారెడ్డి జిల్లా అన్నారం సమీపంలోనే ఇటుక బట్టీలకు తరలించారు. శుక్రవారం రాత్రి కూడా మట్టి తవ్వ కాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకోగా... గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ కమలాద్రి ఆదేశాల మేరకు ఆర్ఐ సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి ఎక్స్‌కవేట ర్‌తో సహాయ వ్యక్తులు పరారయ్యారని ఆర్ఐ కిషన్ తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల బాహాబాహి

- ఇందిరమ్మ ఇంటి శంకుస్థాపనలో వాగ్వాదం
- సీఎం ఫొటో పెట్టలేదని కాంగ్రెస్ నాయకుల అభ్యంతరం
- ఇరుపార్టీల వారికి నచ్చజెప్పిన పోలీసులు

హత్నూర, మే 31 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని ఎల్లమ్మ గూడెంలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్ర మంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి భూమి పూజ చేస్తుండగా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి అక్కడికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలంటూ... కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సీఎం ఫొటో ఉన్నప్పటికీ సరిగ్గా చూడకుండా అభ్యంతరం తెలపడం ఏంటని కొందరు బీఆర్ఎస్ నాయకులు సమాధానం ఇచ్చారు. అంతలోనే ఇరుపార్టీల నాయకులు జై కాంగ్రెస్, జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేసు కున్నారు. అంతలోనే పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరుపార్టీల నాయకు లకు నచ్చచెప్పి శాంతింప జేశారు. అనంతరం ఇరుపార్టీల నాయకులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రే కృష్ణ, బీఆ ర్ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ వావిలాల నర్సింహులు, పీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్య దర్శి ఎం.ఎ.హకీం, ఆయా పార్టీల నాయకులు తదిత రులు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డి చిత్రపటంతో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


'నో టొబాకో డే' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయాధికారులు

ధూమపానానికి
దూరంగా ఉండాలి

సంగారెడ్డి క్రైం/సంగారెడ్డి అర్బన్/హవేళిఘణపూర్, మే 31(ఆంధ్రజ్యోతి) : దేశంలో 90 శాతం నోటి క్యాన్సర్ వంటి వ్యాధులు పొగాకు వల్లే సంబవిస్తు న్నాయని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి డాక్టర్ కృష్ణార్జున్ అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం పొగాకు వ్యతి రేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి తేజో కార్తీక్ మాట్లాడారు. అనంతరం వరల్డ్ నో టొబాకో డేకి సంబంధించి ప్రతిజ్ఞ చేసి వాల్ పోస్ట ర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాలుగో అదనపు న్యాయాధికారి ఎం.లావణ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అనిత, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.మహేష్ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవా ధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)కార్యదర్శి తేజో కార్తీక్ పిలుపునిచ్చారు. సంగా రెడ్డి ఇంద్రనగర్‌లోని యూపీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రపంచ పొగాకు నివా రణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధూమపానంతో అనారోగ్య సమ స్యలు వస్తాయని, మనిషి జీవితం ప్రాణాతకంగా మారుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

● పొగాకు ఉత్పత్తులతో ఆరోగ్య సమస్యలు వస్తాయని మెదక్ సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమ తెలిపారు. శనివారం హవేళిఘణపూర్‌లోని పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. బీడీ, సిగరెట్ ఇతర పొగాకు పదార్థాలు తాగడం వల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ వస్తుందన్నారు. ఇలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




















కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

దొంగతనానికి వచ్చి.. మహిళను అంతమొందించి..

● రుక్మాపూర్ హత్యకేసును ఛేదించిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్

న్యాల్‌కల్, మే 31(ఆంధ్రజ్యోతి) : ఇంట్లో దొంగతనానికి వచ్చిన ప్రబుద్ధుడు మహిళ చూసి ప్రతిఘటించడంతో హత్య చేశాడు. న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఈ నెల 25 అర్ధరాత్రి జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం హద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ కేసు వివరాలను వెల్లడించారు. రుక్మాపూర్ గ్రామానికి చెందిన బోయిని ప్రశాంత్ ప్రైవేటు ఉద్యోగి. కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన అతడు పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో దొంగతనం చేసి డబ్బులు సంపాదించి క్రికెట్ బెట్టింగులు పెట్టాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా ఈ నెల 25న అదే గ్రామానికి చెందిన రాణెమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండడం గమనించి అర్ధరాత్రి సమయంలో వెళ్లి తలుపుతట్టాడు. ఆమె తలుపు తీయగానే బయటకు గుంజుకొచ్చి వరండాలో కిందపడేశాడు. పెనుగులాటలో రాణెమ్మ గాజులు పగలడంతోపాటు నిందితుడికి గాయాలయ్యాయి. దీంతో అతడు చేతులతో ఆమె ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోని మంచంపై పడుకోబెట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లు, పుస్తెలతాడు, పక్కగదిలో ఉన్న ఇనుపపెట్టెలోని రూ.2720 నగదును తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసులు మృతురాలి ఇంటి చుట్టుపక్కల వారిని విచారించారు. నిందితుడు ప్రశాంత్ ఇంటికి కూడా వెళ్లి విచారణ చేస్తుండగా అతని చేతికి తగిలిన గాయాలను పరిశీలించిన పోలీసులు తమదైన శైలిలో ఆరా తీయగా నేరాన్ని ఒప్పుకున్నాడు. అతడి నుంచి మహిళ బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ జక్కుల హన్మంతు, ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన దొంగలు

● మూడు వేర్వేరు ఘటనల్లో నగలు, నగదు వస్తువులు చోరీ

మెదక్, సంగారెడ్డి జిల్లాలో శనివారం మూడుచోట్ల దొంగతనాలు చోటు చేసుకున్నాయి. కంది గ్రామంలో రెండు చోట్ల, నిజాంపేట మండలం కల్వకుంటలో పెద్దమ్మతల్లి ఆలయంలో, వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామంలోని ఓ ఇంట్లో నగదు, నగలు, వస్తువులు చోరీకి పాల్పడ్డారు.

కంది, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న మండల కేంద్రమైన కంది గ్రామంలో దొంగలు చెలరేగిపోయారు. శుక్రవారం తెల్లవారుజామున కొత్త కందిలోని పాండురంగ స్వామి వీధిలో తాళం వేసి ఉన్న జగదీష్ అనే యజమాని ఇంటిని కొల్లగొట్టారు. ఆ ఇంట్లో నుంచి తులం న్నర బంగారం, వెండి పూజా సామాగ్రి వస్తువులు, కొంత నగదును దోచుకెళ్లారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించినప్పటికీ ఎలాంటి ఆధారాలు పోలీసులకు దొరకలేదు. మళ్లీ శనివారం తెల్లవారుజామున కంది శివారులో ఉన్న ఓ డాక్యుమెంట్ రైటర్ షాప్‌లో ఇదే తరహాలో తాళం పగలగొట్టి షెట్టర్ తెరిచి దర్జాగా లోపలికి వెళ్లారు. అందులో నుంచి ఒక సీపీయూ (కంప్యూటర్ ప్రాసెస్ యూనిట్) ఒక మానిటర్‌ను తస్కరించారు. పోలీసులు ఎంత నిఘా ఏర్పాటు చేసినప్పటికీ దొంగతనాలు మాత్రం ఆగటం లేదని కంది గ్రామస్థులు వాపోతున్నారు. కంది గ్రామం మొత్తం సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కూడా దొంగలు జంకు లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కంది గ్రామంలో రాత్రిపూట పోలీసుల గస్తీ పెంచాలని కోరుతున్నారు.

పెద్దమ్మ ఆలయంలో..



ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంపేట, మే 31(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పూజలు నిర్వహించి ఆలయానికి తాళం వేసి వెళ్లారు. కాగా రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళాన్ని పగులగొట్టి చొరబడి అమ్మవారి పుస్తె మట్టెలు, నగదు అపహరించారు. శనివారం ఉదయం ఆలయ నిర్వాహకులు వచ్చి చూడగా ఆలయానికి ఉన్న తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా అమ్మవారి నగలతో పాటు ఆలయ హుండీలోని నగదు కనిపించలేదు. చోరీకి గురైందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అలాగే వెంకటాపూర్, నార్లాపూర్ గ్రామాలలో ఉన్న ఆలయాల్లో కూడా చోరీకి ప్రయత్నం చేశారని ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. ఆలయ నిర్వాకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

వెల్దుర్తి, మే31(ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగళపర్తి గ్రామానికి చెందిన మ్యాదరి నర్సింహులు ఈ నెల 28న తమ కుటుంబ సభ్యులతో కలిసి జిన్నారం లోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ. 45వేల నగదు దుండగులు దొంగిలించారని గుర్తించాడు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన అశోక్

సంగారెడ్డి క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి) : చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17న సంగారెడ్డి పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి(60) స్పృహలేకుండా పడి ఉన్నాడు. అతడిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి పేరు అశోక్, అతడి తండ్రి కుల్దీప్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఏ ప్రాంతానికి చెందినవాడో తెలియలేదనీ, ఎవరైనా గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసుకు భయపడి వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి) : కేసు అవుతుందని భయపడిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో శనివారం జరిగింది. ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం అల్లీపూర్‌కు చెందిన రేఖతో అనిల్‌కుమార్(30)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల వారి కుమారుడి ఆరోగ్యం బాగులేకపోవడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం.. గొడవలు జరగడంతో భార్య రేఖ పోలీసులను ఆశ్రయించింది. దీంతో తనపై కేసు అవుతుందనే భయంతో అనిల్‌కుమార్ అల్లీపూర్‌లోని ఈద్గా వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నీ గుమ్మం వద్దకే..

ఒక్క క్లిక్‌తో ఇంటి నుంచే ఆన్‌లైన్ షాపింగ్

● అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు

● జిల్లాలో విస్తరిస్తున్న ఈ కామర్స్ సేల్స్

● నిత్యావసర వస్తువులు, తినుబండారాలు సైతం ఆర్డర్

● ప్రతీ రోజు రూ.లక్షల్లో వ్యాపారం.. యువతకు ఉపాధి





సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 31: ఒకప్పుడు కుటుంబ సమేతంగా దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌కి వెళ్లి తమకు నచ్చిన రంగులు, వస్తువుల నాణ్యతను బట్టి అవసరమైనవన్నీ కొనుగోలు చేస్తుండేవారు. ధర గిట్టుబాటు కాకుంటే బేరమాడి మరీ తక్కువకు కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఆధునిక జీవితంలో వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలో, పని ఒత్తిడి వల్లో తెలియదు కానీ, పలు కారణాల వల్ల ఇంటి గుమ్మం దాటి బయటకు వెళ్లి షాపింగ్ చేయాలంటే చాలా మంది ఆసక్తి కనబరచడంలేదు. తమకు నచ్చిన వాటిని ఎంచక్కా ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేస్తున్నారు. అరచేతిలో ఉన్న మొబైల్ ద్వారా పలు ఈ కామర్స్‌లకు చెందిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని, అన్నీ గుమ్మం వద్దకు వచ్చేలా ఒక్క క్లిక్‌తో ఆర్డర్ పెడుతున్నారు. దీంతో సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు ఈ కామర్స్‌లకు చెందిన ఆన్‌లైన్ కొనుగోలుతో లక్షల్లో వ్యాపారం జరుగుతున్నది.

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు..

ఒక స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఎక్కడి నుంచైనా.. ఏ వస్తువైనా ఇంటి దగ్గర ఉండే కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుతం ప్రతీ ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉంటుంది. ఏ సమాచారం కావాలన్నా సరే మొబైల్‌లోని గూగుల్‌లో సెర్చ్ చేస్తే చాలు అన్నీ విషయాలు క్షణాల్లో తెలిసిపోతున్నాయి. ఇక షాపింగ్ విషయానికి వస్తే తమకు కావాల్సిన వాటిని సమయం దొరికినప్పుడల్లా ఈ కామర్స్‌లకు చెందిన యాప్‌లలో ఆర్డర్ చేస్తే మూడు నాలుగు రోజుల్లో ఇంటివద్దకు చేరుతున్నాయి. వీటిలో మరి త్వరగా కావాలనుకుంటే ఒకటి రెండు రోజుల్లో కూడా వచ్చే యాప్‌లు కూడా ఉన్నాయి. దుస్తులు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, మెడికల్‌కు సంబంధించిన సామాగ్రి, మందులు, చర్మానికి సంబంధించిన క్రీములు, నిత్యవసర సరుకులు ఇలా ఒక్కటేమిటి అన్నీ యాప్‌లో అందుబాటులో ఉంటున్నాయి. మనుషులతో పాటు ఇంట్లో పెంచుకునే కుక్కలకు సంబంధించినవి సైతం లభిస్తున్నాయి.

దేశ నలుమూలల నుంచి..

రాష్ట్రంలోని హైదరాబాద్‌లాంటి నగరాలతో పాటు న్యూ ఢిల్లీ, ముంబయి, పూణేలతో పాటు దేశంలోని నలుమూలల నుంచి ఉత్పత్తిదారులు తయారుచేసిన వాటిని సిద్దిపేట జిల్లాలోకి వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా దిగుమతి చేసుకుంటున్నారు. చాలా దూర ప్రాంతాల నుంచి వస్తువులు వస్తుండటంతో ఒక్కో సందర్భంలో వారం నుంచి పది రోజుల సమయం పడుతున్నది. నేరుగా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తుండటంతో బయట ధరతో పోల్చుకుంటే తక్కువ ధరకు లభ్యమవుతుండటంతో వినియోగదారులు ఆన్‌లైన్ కొనుగోలుకే మక్కువ చూపుతున్నారు. ఉత్పత్తిదారులు కూడా సాధ్యమైనంత మేరకు నాణ్యత విషయంలో వినియోగదారులకు నచ్చేలా బ్రాండ్‌కు తగ్గట్లుగా తయారుచేస్తున్నారు. అంతేగాక వచ్చిన ఆర్డర్లు తీసుకున్న తరువాత ఇతర కారణాలతో అవి నచ్చకపోతే తిరిగి పంపించేందుకు (రిటర్న్ ఆప్షన్) కూడా ఉత్పత్తిదారులు అవకాశాన్ని కల్పించారు.

నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం..

ప్రతీరోజు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రూ.లక్షల్లో ఆన్‌లైన్ వ్యాపారం జరుగుతున్నది. సగటున దాదాపు రూ.30వేల నుంచి రూ.50 వేలకు పైగా ఆయా ఉత్పత్తిదారుల నుంచి వస్తువులు వినియోగదారులకు చేరుతున్నాయి. ఈ కామర్స్ వ్యాపారం వల్ల అటు యువతకు కూడా ఉపాధి అవకాశాలు దక్కుతున్నాయి. ఉదయాన్నే వచ్చిన ఆర్డర్‌లు తీసుకొని ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒకరి నుంచి మరొకరికి పాకిన ఈ యాప్‌ల వల్ల ఇప్పుడు ఆన్‌లైన్ షాపింగ్‌కు యమ క్రేజ్ పెరుగుతున్నది. వినియోగదారులపై ఎలాంటి పన్నులు విధించకపోవడం, దానికి తోడు ఉచితంగా డోర్ డెలవరీ చేస్తుండటంతో ఆన్‌లైన్ ఆర్డర్‌ల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతున్నది.

ఫేక్ యాప్‌లతో నష్టం..

కాగా ఈ కామర్స్ వల్ల వ్యాపారాలు సమృద్ధిగా సాగుతుండటంతో కొందరు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ఫేక్ యాప్‌లు, లింక్‌లు ఏర్పాటు చేసి గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. ఆ లింక్‌లపై క్లిక్ చేయగానే డబ్బులు ఖాతా నుంచి మాయమవుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ బిజినెస్ గ్రూపు, ఫేస్‌బుక్, ఎక్స్ లాంటి తదతర వాటిలో డిస్కాంట్ చూపిస్తూ వినియోగదారులను ఆకర్షించి మోసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇలాంటి మోసాల వల్ల వినియోగదారులు చాలమంది నష్టపోయినట్లు తెలిసింది. సోషల్‌మీడియాలో ఒకటి చూపెట్టి వినియోగదారుడికి మరొకటి పంపిస్తున్నారు. అవి తిరిగి పంపించేందుకు వీలు లేకపోవడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



దిగ్గజ సంస్థలైన ఈ కామర్స్ ద్వారానే, నమ్మకమనిపిస్తేనే కొనుగోలు చేయాలి. సోషల్ మీడియా వేదిక చేసుకొని కొందరు కేటుగాళ్లు ఫేక్ యాప్‌ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారు. వ్యక్తిగతంగా, వాట్సప్ గ్రూప్‌లలో పంపిన లింకులను ఓపెన్ చేయవద్దు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే మొబైల్ నంబర్ 8126655565కు గాని లేదా సిద్దిపేట జిల్లాలోని సీపీ కార్యాలయం రెండవ అంతస్తులో ఉన్న సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాలి.

-శ్రీనివాస్, ఏసీపీ, సైబర్ క్రైమ్, సిద్దిపేట

మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు

కవిత ఎందుకు మాట్లాడలే?

● ఇప్పుడు సామాజిక తెలంగాణ అనడం విడ్డూరం

● మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు



గజ్వేల్ పట్టణంలో అహల్యాబాయి జయంతి ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్/మెదక్ అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మంత్రి పదవులు ఇవ్వనప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ప్రశ్నించారు. లోకమాత అహల్యాబాయి 300వ జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కవితమ్మ కొత్తగా సామాజిక తెలంగాణ నినాదాన్ని ఎత్తుకుందని, 2014, 2018లో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు బీసీలకు జనాభా దామాషా పద్ధతి ప్రకారం ఎందుకు మంత్రి పదవులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆనాడు ఆమె తండ్రిని ఎందుకు అడుగలేదన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేశామని, 12 మంది మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని, బీసీ కమీషన్‌కు రాజ్యాంగ భద్రత, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులు ఇచ్చామని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు ఇవ్వలేదని, పూలే విగ్రహం పెట్టలేదని, మహిళలకు మంత్రి పదవి ఇవ్వకపోతే నిజామాబాద్ ఎంపీ పదవికి రాజీనామా చేయలేదో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆయనవెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, నాయకులు నందన్‌గౌడ్, మనోహర్‌యాదవ్, మహేశ్, సురేశ్, అశోక్‌గౌడ్ తదితరులున్నారు. అలాగే జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కవితారెడ్డి ఆధ్వర్యంలో అహల్యాబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

● వర్గల్, మే 31 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయానికి బొలేరోను ఎంపీ రఘునందన్‌రావు అందజేశారు. ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు హెటిరో ఫార్మా పరిశ్రమతో కలసి వాహనాన్ని అందజేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ రఘునందన్‌రావు రైల్వే శాఖ కేంద్ర సహాయ మంత్రి సోమన్నను కోరారు. శనివారం హైదరాబాద్ నుంచి కర్ణాటకకు బయలుదేరిన మంత్రిని రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ ఈదులనాగులపల్లి వద్ద బీజేపీ ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి అంజిరెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు రాంబాబు, మహేందర్ తదితర నాయకులు కలిసి సమస్యలను వివరించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పదిరోజులని నెలలపాటు మూసివేత' కథనానికి స్పందించిన మంత్రి నాగులపల్లి రైల్వేగేట్‌ను పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశించారు.



భూ బాధితులకు నచ్చచెబుతున్న పోలీసులు

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ వద్ద భూ బాధిత కుటుంబం ఆందోళన

పుల్‌కల్, మే 31 (ఆంధ్రజ్యోతి): భూ పరిహారానికి సంబంధించి హామీలు నెరవేర్చకుండా తమ భూమిలో పనులెలా చేస్తారని బాధితుడు గొల్ల మల్లేశం కుటుంబంతో కలిసి శనివారం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ వద్ద ఆందోళనకు దిగాడు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 40/ఇలోని మల్లేశంకు చెందిన 3.05 ఎకరాల భూమిని జేఎన్టీయూ నిర్మాణానికి 2012లో సేకరించారు. దీనికోసం పరిహారం కింద అప్పట్లో రూ.8,70,434 మంజూరుకాగా, రెవెన్యూ అధికారులు ఆ భూమిని జేఎన్టీయూ పేరున బదాలయించారు. పరిహారం ఏ మాత్రం సరిపోదంటూ బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో చేసేదేమీలేక జేఎన్టీయూ అధికారులు మిన్నకుండిపోయారు. మంజూరైన పరిహారాన్ని అందోలు-జోగిపేట ఆర్డీవో ఖాతాలో జమ చేశారు. ఈ నేపథ్యంలో గొల్ల మల్లేశం గతంలో ధరణి పోర్టల్ ఆధారంగా 3.05 ఎకరాల భూమిని తిరిగి తన పేరున మార్పిడి చేయించుకున్నాడు. ఆరు నెలల క్రితమే ఈ విషయాన్ని తెలుసుకున్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తప్పును గుర్తించిన ఉన్నతాధికారులు ఆ భూమిని మళ్లీ ఆ కళాశాల పేరున మార్చారు. దీన్ని తప్పు పడుతూ బాధితుడు గత డిసెంబరు 30న అధికారులతో వాగ్వివాదానికి దిగి, ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. ఈ విషయంలో మంత్రి దామోదర చొరవ చూపి కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి జేఎన్టీయూలో టైం స్కేల్ పే ఉద్యోగాలు, జీవనాధారం కోసం నాలుగు గుంటలు భూమి ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని అప్పట్లో హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎడమ వైపున మిగిలిపోయిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న భూ బాధితుడు గొల్ల మల్లేశం శనివారం భార్య సాయమ్మ, కుమారుడు రవి ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోలు డబ్బా వెంటబెట్టుకుని వచ్చి పనులను అడ్డుకున్నారు. మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పనులు ఎలా చేస్తారని ఆందోళనకు దిగాడు. న్యాయం చేయకుంటే కుటుంబ సభ్యులందరం పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ పోలీసు సిబ్బంది జేఎన్టీయూ వద్దకు చేరుకుని బాధితులకు నచ్చజెప్పి, కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు తీసుకువెళ్లారు. టైం స్కేల్ పే ఉద్యోగం ఇప్పించాలని బాధితులు కోరగా పర్మినెంట్ ఉద్యోగం నా చేతుల్లో లేదని ప్రిన్సిపాల్ నరసింహ తెలిపారు. ఈ మేరకు పోలీసులు బాధితులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

జాతీయ రోయింగ్ పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థి ప్రతిభ



రోయింగ్ పోటీల్లో అభిజిత్ యాదవ్

హుస్నాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మే 27 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించిన నేషనల్ సబ్ జూనియర్ రోయింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన కాశబోయిన అభిజిత్‌యాదవ్ ప్రతిభ చాటాడు. క్వాటర్స్‌లో గోల్డ్ మెడల్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. అభిజిత్ హైదరాబాద్‌లోని హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఈ మెడల్స్ సాధించడంపై హుస్నాబాద్ పట్టణానికి పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.







సంప్రదాయ వేడుకల సందడి

● ఐఐటీహెచ్‌లో ఆకట్టుకున్న శాస్త్రీయ కళా ప్రదర్శనలు ● కొనసాగుతున్న స్పిక్ మైకే సదస్సు

కంది, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో శనివారం స్పిక్ మైకే అంతర్జాతీయ సదస్సు ఆరవ రోజు కొనసాగింది. భారతీయ శాస్త్రీయ కళలలో అత్యుత్తమమైన వాటిలో విద్యార్థులను ముంచెత్తే అనుభవాన్ని ఈ వేడుక పరిచయం చేసిందని సాహితీవేత్తలు ప్రశంసించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ యోగా, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం యోగ నిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విద్వాన్ జీజేఆర్ కృష్ణన్, విదుషి లాల్గుడి విజయలక్ష్మి కర్ణాటక వయోలిన్, పండిట్ ఉల్హాస్ కషల్కర్ హిందుస్తానీ గాత్రం, పండిట్ సురేష్ తల్వాల్కర్, తబలా ఉస్తాద్ బహాద్దీన్ దాగర్, రుద్ర వీణ, విదుషి కపిల వేణు కూడియాట్టం, ఉస్తాద్ ఎఫ్. వసీఫుద్దీన్ దాగర్ ధృపద్ కార్యక్రమాలు వీనుల విందుగా జరిగాయి. ఈ సదస్సులో స్పిక్ మైకే జాతీయ చైర్‌పర్సన్ ఆర్.ఎం. తివారీ, సాహితీ వేత్తలు, పండితులు, సంగీత విద్వాంసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేదెప్పుడో..!

● ఆనవాళ్లు కోల్పోయిన మర్రిముస్త్యాల గ్రామం
● రోడ్డుపనులు పూర్తయినా మొక్కల పెంపకంపై కానరాని చర్యలు

చేర్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-సిరిసిల్ల 365-బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా జనగామ నుంచి దుద్దెడ వరకు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం రోడ్డు వెంట ఉన్న భారీ వృక్షాలను తొలగించారు. కానీ ఇప్పటివరకు మొక్కలు నాటకపోవడంతో దారి పొడవునా ఎక్కడా నిలబడే పరిస్థితి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్లను నరికివేయడంలో చూపిన మక్కువ.. మొక్కల పెంపకం పట్ల చూపకపోవడంతో హరిత ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జనగామ నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు 45.57 కిలోమీటర్ల మేర నాలుగులేన్ల రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.438 కోట్లు మంజూరు చేసింది. యూపీకి చెందిన ఆర్‌అండ్‌సీ కంపెనీ ఈపీసీ(ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో రెండేళ్లక్రితం పనులు చేపట్టింది. టూ లేన్ విత్ షేవ్డ్ షోల్డర్స్‌గా దారిని తీర్చిదిద్దనుండటంతో తొలుతగా జంగిల్ కటింగ్ పనులు నిర్వహించారు. జనగామ-సిద్దిపేట జిల్లాల సరిహద్దులోని బచ్చన్నపేట మండలం వీఎస్‌ఆర్‌నగర్ నుంచి దుద్దెడ క్రాస్ వరకు రోడ్డుపక్కన గల 341 భారీ వృక్షాలను గుర్తించి నరికేయించారు. అంతేకాకుండా హరితహారంలో నాటిన వందలాది చెట్లను నేలకూల్చారు. చేర్యాల పట్టణంలో ఎక్కడా చెట్లు లేకుండాపోయాయి. దీంతో ఎన్నోయేళ్లుగా రోడ్డుపక్కన చల్లటి నీడ నందించడంతో పాటు పశు, పక్షాదులకు ఆశ్రయమిచ్చిన వృక్షాలు కనుమరుగయ్యాయి. పొట్టకూటి కోసం చిన్నా చితక వ్యాపారులకు అనుకూలంగా నిలిచిన చెట్లు గొడ్డలివేటుకు బలయ్యాయి.

ఆనవాళ్లు కోల్పోయిన మర్రిముస్త్యాల గ్రామం

చెట్ల నరికివేతతో కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాల గ్రామం ఆనవాళ్లు కోల్పోయింది. దశాబ్దాల క్రితం ఊరి నామకరణానికి కారణమైన భారీవృక్షాన్ని నేలకూల్చడంతో కళతప్పి చిన్నబోయింది. బతుకమ్మ పండుగైనా, భగవత్ ఆరాధనా కార్యక్రమాలైనా చెట్టు ఆవరణలోనే జరుపుకునేవారు. ఎవరు కొత్తవారు వచ్చినా భారీ మర్రి చెట్టు చూడగానే టక్కున మర్రిముస్త్యాల అని గుర్తించేవారు. కానీ ప్రస్తుతం సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయడంతో భారీ మర్రివృక్షాన్ని నరికేసి తొలగించారు. .

ఒకచెట్టుకు రెండు మొక్కలు, రూ.500డిపాజిట్

వాల్టాచట్టం ప్రకారం ఒకచెట్టు తొలగిస్తే రెండు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుని ఒక్కోచెట్టుకు రూ.500 చొప్పున డిపాజిట్ చేసినట్లు చెట్ల తొలగింపు సమయంలో ఎన్‌హెచ్ అధికారులు వెల్లడించారు. కొంతకాలం క్రితమే డ్రెయిన్, బీటీ పనులు పూర్తిచేయడంతో రయ్యీమని దూసుకెళ్తా రాకపోకలకు సులువైనప్పటికీ మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటే ఈపాటికి కొంతమేర ఏపుగా పెరిగేవి. కానీ మొక్కల పెంపకం చేపట్టక పోవడంలో సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుంటడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


చేర్యాల శివారులో బోసిపోయిన రహదారి


మర్రిముస్త్యాల గ్రామంలోని భారీ మర్రివృక్షం

మొక్కల పెంపకం చేపట్టాలి

రహదారి విస్తరణ పనులకోసం భారీవృక్షాలను తొలగించారు. ఎంతోమంది చెట్లనీడన బతికేవారు. కానీ నరికివేయడంతో రోడ్డు పక్కన నిలబడలేని పరిస్థితి లేదు. వాల్టా చట్టం ప్రకారంతో పాటు హరితమయం కోసం విరివిగా మొక్కలు నాటాలి. కొన్నాళ్ల క్రితమే మొక్కల పెంపకం చేపడితే ఏపుగా పెరిగి కొంతమేరనైనా నీడ కల్పించే పరిస్థితి ఉండేది. ఎన్‌హెచ్ అధికారులు చొద్యం వీడాలి.

- అందె అశోక్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు

పేదోడి ధైర్యానికి ప్రతీక సీపీఐ

● సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్

చేర్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదోడి నమ్మకం, ధైర్యానికి ప్రతీకగా సీపీఐ పాటుపడుతుందని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సీపీఐ 13వ మండల మహాసభను పురస్కరించుకుని శనివారం చేర్యాల మండలకేంద్రంలో హనుమాన్ దేవాలయం నుంచి స్థానిక షాదీ ఖానా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరీ విముక్తికోసం పేదప్రజల పక్షాన సీపీఐ చిత్తశుద్ధి తో పోరాడిందన్నారు. త్యాగాలు, పోరాటాలు చేసేది ఒక్కటేనని, సూర్యచంద్రులున్నంత వరకు సీపీఐ పేదోడి గుండెలో పదిలంగా ఉంటుందన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలు, కార్మికులు, కర్షకుల హక్కుల కోసం పాటుపడిందన్నారు. మరింత సంస్థాగత బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు.

మహిళల రక్షణకే షీ టీం ప్రత్యేక సేవలు


ఉపాధిహామీ కూలీలకు మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

సిద్దిపేట రూరల్,మే31(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు షీ టీం ప్రత్యేక సేవలు అందిస్తుందని, మహిళలకు ఏ రకమైన ఇబ్బందులు ఉన్న మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని షీ టీం బృందం ఏఎస్సై కిషన్ తెలిపారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఉపాధి హామి కూలీలకు క్షేత్రస్థాయిలో షీటీం బృందం చట్టాల పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై కిషన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు మీకు ఫోన్ చేసినప్పుడు మాట్లడవద్దని, మీ వ్యక్తి గత వివరాలు వారికి వెల్లడించవద్దని సూచించారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే అంత భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. మహిళల భద్రతకు షీ టీం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్కూల్ సమయంలలో పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలన్నారు. సామాజిక రుగ్మతల గురించి సెల్ఫోన్‌కు ఎంత దూరం ఉంటే అంత మంచిదని, సెల్ ఫోన్ వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు కుడా ఉందని, సెల్‌ఫోన్‌కు భానిస కావద్దని తెలిపారు.వెసవి కాలంలలో పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు వ్యవసాయ పనులకు వెల్లెటప్పుడు వంటి పై బంగారం ఉంటే దొంగతనాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతే 100 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీ 'చామల'పై అనుచిత వ్యాఖ్యలు తగవు

చేర్యాల, మే31 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపట్ల సీపీఎం నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. శనివారం చేర్యాల మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి చేర్యాల ప్రాంత ప్రజలకు అందుబాటులోఉండి అభివృద్ధితో పాటు రైతాంగ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారన్నారు. దానంపల్లి, కమలాయలపల్లి, అర్జునపట్ల, ఆకునూరు తదితర గ్రామాలకు రంగనాయకసాగర్ నీటిని అందించారన్నారు. సీపీఎంనుండి పలువురు కాంగ్రెస్‌లో చేరడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవాచేశారు. చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు ఎంపీ చామల తనవంతు కృషిచేస్తున్నారన్నారు. ఉనికి కోసం పనికిరాని నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికారు.

న్యూట్రి గార్డెన్లను ఏర్పాటు చేయాలి

● అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

సిద్దిపేట కలెక్టరేట్, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్లను ఏర్పాటు చేసి సులువుగా పెరుగుతూ పోషకాహారం ఇచ్చే కూరగాయల మొక్కలు నాటాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. శనివారం ఐడీవోసీలోని మినీ సమావేశ మందిరంలో అధికారులతో ఎస్ఎల్‌బీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాలయాలలో సులువుగా పెరుగుతూ పోషకాహారం ఇచ్చే కూరగాయల మొక్కలు నాటాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. మునగ, కరివేపాకు, ఆకు కూరలు లాంటి మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని, స్థలం ఎక్కువగా ఉన్న చోట ఈజీఎస్‌లను ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతి స్కూల్ లో డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలని, అన్ని ప్రభుత్వ స్కూల్ లలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించేలా ప్రదానోపాధ్యాయులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేల ఆదేశించాలని సూచించారు. ముందస్తు రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని వర్షాకాలంలో వాతావరణంలో వచ్చే మార్పుల వలన వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లోపించడం నీరు కలుషితం కావడం వలన, నీటి నిల్వలు మురికి కాలువలోనీ నీరు ఉండడంతో దోమలు, ఈగల వృద్ధి చెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని అన్నారు. కలుషిత నీటిని ప్రజలు తాగడం వలన డయేరియా, అతిసారం, అపరిశుభ్రతమైన ఆహారము తినడం వల్ల వాంతులు, విరోచనాలు, గ్యాస్ట్రో ఇన్టైటిస్ వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయని మరియు దీనికి తోడు కీటక జనిత వ్యాధుల వల్ల ముఖ్యంగా దోమ కుట్టడం ద్వారా విష జ్వరాలు మలేరియా డెంగ్యూ, మెదడువాపు, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రైవేట్ ఆస్పత్రిలో నోటిఫైయబుల్ డిసీజెస్ సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యా శాఖ అధికారి డాక్టర్ పల్విన్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో చేపడుతున్న నివారణ చర్యల గురించి వివరిస్తూ ఇప్పటికే ముందస్తు ప్రణాళికతో ఎటువంటి వ్యాధులైన ఎదుర్కోవడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని అన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించిన గజ్వేల్ ఆర్డీవో


గజ్వేల్ మండల స్థాయి రేషన్ స్టాక్ పాయింట్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రకళ

గజ్వేల్, మే 31 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ సందర్శించారు. జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు చౌకధరల దుకాణాలకు ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని సరఫరా చేయాలని సివిల్ సప్లై అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేసేందుకు సరిపడా వాహనాలను, కూలీలను సమకూర్చాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం

రాయపోల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి ఉపయోగపడుతుందని రాయపోల్ తహసీల్దార్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో రైతులు సమస్యలున్న భూమికి సంబంధించిన అన్ని ఆధారాలతో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 16 లోపు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం

తొగుట, మే 31(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని తొగుట పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణరెడ్డి పేర్కొన్నారు. శనివారం తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారికి ఆయన అందజేశారు.

పోలీసు అధికారులను సన్మానించిన సీపీ


ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు సీపీ డాక్టర్ బి.అనురాధ సూచించారు. సిద్దిపేట సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన సిఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఆర్‌ఎస్ఐ కత్తి సాయిలు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై శంకర్ రెడ్డి, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ములుగు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాంబాబులను కమిషనరేట్ కార్యాలయంలో సిపి డాక్టర్ బి.అనురాధ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పని చేసి అందరి మన్ననలు పొందారని శుభాకాంక్షలు తెలియజేస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్ పత్రాలను అందజేశారు. పోలీస్ రిటైర్మెంట్ కేవలం తన వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని కొనియాడారు.

చెరువు మట్టి.. కొల్లగొట్టి

(5వ పేజీ తరువాయి..)

తవ్వుతున్న మట్టి కొండంత. రెండు రోజుల నుంచి పెద్ద పెద్ద టిప్పర్ వాహనాలను పెట్టి మట్టిని తరలిస్తున్నారు.

ఒక్కో టిప్పర్ మట్టి రూ.4 నుంచి 6 వేలకు

రైతుల పేరిట అనుమతి తీసుకున్న వారు పలువురు రైతులకు చెందిన వ్యవసాయభూములకు నామమాత్రంగా తరలించి, పెద్దఎత్తున బయట వ్యక్తులకు విక్రయిస్తున్నారు. రెండు రోజుల నుంచి ఎక్స్‌కవేటర్‌తో తవ్విస్తూ ఏడెనమిది టిప్పర్‌ల ద్వారా తరలించి దోచేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌ను మట్టిని రూ. 4 నుంచి 6 వేలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా ఇలాంటి మట్టి దందాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నించిన వారిపై గతంలో దాడులకు పాల్పడిన సంఘటనలు సైతం ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాల్సిన అధికారులే చోద్యం చూస్తుండటంతో ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. మట్టి దందా నిర్వహిస్తున్న వారిపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకొని అక్రమార్కుల భరతం పట్టాలని కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు, మే 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 3 నుంచి జరిగే రెవెన్యూ భూ భారతి సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు తహసీల్దార్ అరిఫా కోరారు. శనివారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 3 నుంచి భూభార తి రెవెన్యూ సదస్సులో గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని, రైతుల సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆమె కోరారు. అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులు ఉన్నవారికి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించారు. డీలర్లు ప్రతి ఒక్కరు రేషన్‌బియ్యాన్ని అందించాలని కోరారు.

గాలయ్య సేవలు అభినందనీయం


సబార్డినేట్ గాలయ్యను సన్మానించిన సిబ్బంది

మద్దూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో బాధ్యతగా సేవలు అందించిన చిలుముల గాలయ్య సేవలు అభినందనీయమని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం యూడీసీ సుదయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆఫీసు సబార్డినేట్‌గా విధులు నిర్వహించిన గాలయ్య పదవీ విరమణోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గాలయ్యకు శాలువా కప్పి సన్మానం చేశారు.


ఉద్యోగ విరమణ సహజం

గజ్వేల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పారిశుద్య విభాగం ఉద్యోగి సత్తయ్య పదవీ విరమణ సందర్భంగా ఆయనను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సర్కారు బడిని బలోపేతం చేద్దాం

కుకునూరుపలి/బెజ్జంకి/చిన్నకోడూరు/కొండపాక, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల బడి బాట కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచుదామని, సర్కారు బడిని బలోపేతం చేద్దామని టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార జాతా 4వ రోజు కొండపాక మండలం దుద్దడ గ్రామానికి చేరుకుంది. దుద్దెడలోని అంబేడ్కర్ సర్కిల్లో టీఎస్ యూటీఎఫ్ ఏర్పాటు చేసిన అభిప్రాయ సేకరణ సమావేశంలో కొండపాక మండల విద్యాధికారి పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపుకై టీఎస్ యూటీఎఫ్ చేపట్టిన ప్రచార జాత అభినందనీయమన్నారు. వేసవి సెలవుల్లో కూడా టీఎస్ యుటిఎఫ్ సంఘ సభ్యులు అంతరాలు లేని సమాజ నిర్మాణ కోసం చేపట్టిన ప్రచార జాత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం టీఎస్ యూటీ ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు షేక్ వలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరిలు మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయ సంఘంగా టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడం కోసం ఒక ప్రచార యాత్రను చేపట్టామని అన్నారు. ముద్దాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో శనివారం ఎంఈఓ బచ్చలి సత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో మీ పిల్లలను చేర్పిస్తే భారీ ఖర్చు అవుతుందని, ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతుందని, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్ ఇతర వసతులు ఉచితంగా అందుతాయని అత్యుత్తమైన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులకు విద్యను బోధిస్తున్నామని, తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకి పంపించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచి పాఠశాలలను బలోపేతం చేద్దామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్ పిలుపునిచ్చారు.

వరంగల్ తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుడిగె మహేష్

ములుగు, మే 31 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి ములుగు మండలం నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు వరంగల్‌కు తరలిపోవడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బుడిగె మహేష్ మాదిగ అన్నారు. శనివారం ములుగు మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు వరంగల్‌కు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి తన సొంత జిల్లా వరంగల్‌కు వస్తారని ఆయనకు స్వాగతం పలకడానికి మండలం నుంచి భారీ సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెళ్లారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆదాసు మహేష్ మాదిగ, ఉపాధ్యక్షులు అనంగాల మల్లేష్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సింగన్నగూడ అధ్యక్షులు బొర్రా ప్రవీణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో భూమిలో పోషకాలు

రాయపోల్, మే 31 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని దీంతో భూమిలోని పోషక పదార్థాల పరిమాణం తెలుస్తుందని సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైలాండ్ అగ్రికల్చర్(సీఆర్ఐడీఏ) శాస్త్రవేత్త డాక్టర్ శరత్‌చంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాయపోల్‌లో జరిగిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసర్చ్(ఐసీఏఆర్) శాస్త్రవేత్తలు రాయపోల్, తిమ్మకపల్లి గ్రామాల్లో పర్యటించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శరత్ చంద్రన్ మాట్లాడుతూ, రైతులకు వారి భూమిలోని పోషక పదార్థాల పరిమాణం తెలిస్తే భూమిక అవసరమైన ఎరువులను వాడడం జరుగుతుందని దీంతో పెట్టుబడులు ఖర్చు తగ్గుతుందని వివరించారు. అలాగే వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో ఉపయోగించే యంత్రాలను వివరించారు. వ్యవసాయంలో యంత్రాలు ఉపయోగించడం వల్ల కూలీల కొరత తీరడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. విత్తనాల కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వివిధ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, అధిక దిగుబడినిచ్చే రకాలను సూచించారు. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ పద్దతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త రవి, శాస్త్రవేత్త పీసీ మీనా, తదితరులు పాల్గొన్నారు.

మాకొద్దు.. ఈ పంచాయతీ కార్యదర్శి

చేర్యాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామపంచాయతీ కార్యదర్శి రాజమణిని వెంటనే బదిలీ చేయాలని కోరుతూ గ్రామస్థులు శనివారం సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇబ్బందులు వివరించారు. గ్రామసేవల నిమిత్తం ఎవరు వెళ్లినా హీనంగా చూస్తుందని, సక్రమంగా విధులు నిర్వర్తించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. గతంలో గ్రామంలో పనిచేసిన సమయంలో ప్రజాగ్రహానికి గురవడంతో బదిలీ చేసినప్పటికీ మళ్లీ నియమించడంతో తాము వ్యతిరేకించడంతో ప్రవర్తన మార్చుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కానీ ఆమెలో ఎలాంటి మార్పురాలేదని ఆరోపించారు. చెత్తసేకరణ వాహనాన్ని పంపించడం లేదని, ఆమెను భరించే ఓపిక తమకు లేదని, కొనసాగిస్తే సమస్యలు ఉత్పన్నమవుతాయని, వెంటనే ఆమెను తప్పించాలని విన్నవించారు. దీంతో విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా అడిషనల్ కలెక్టర్ అగర్వాల్ గ్రామస్థులకు తెలిపారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన సీపీఐ నేత

హుస్నాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను శనివారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. గుండెపోటుతో మృతి చెందిన పట్టణంలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి మోర శ్రీహరి, అనారోగ్యంతో మృతి చెందిన వడ్డెపల్లి వెంకటరమణ కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, నాయకులు కొమ్ముల భాస్కర్, ఎగ్గోజు సుదర్శనచారి, గూడ పద్మ, మల్లారెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయుల ముందస్తు అరెస్ట్

హుస్నాబాద్ టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : 317 జీవోకు వ్యతిరేకంగా చేపట్టిన ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్లకుండా శనివారం పలువురు ఉపాధ్యాయులను హుస్నాబాద్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు 317 బాధితులకు న్యాయం చేకూరేలా మా స్థానికత ఆధారంగా మా సొంత జిల్లాలకు పంపిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయడం లేదని తెలిపారు. ఈ ప్రజా ప్రభుత్వంలో చలో సెక్రటేరియట్‌కు వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్‌లు చేయడం శోచనీయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఉపాధ్యాయులు వేముల శ్రీనివాస్, గాజుల రమేశ్, కక్కెర్ల రవీందర్, బోనగిరి రాజేందర్, మోగిలి, భుక్యా తిరుపతి తదితరులున్నారు.

పద్మశాలి ఎన్నికల్లో రవితేజ విజయం

సిద్దిపేట క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): మే 26న జిల్లా కేంద్రంలోని జరిగిన పద్మశాలి సమాజం ఎన్నికల్లో 472 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచిన కాంగ్రెస్ నాయకుడు గుండు రవితేజ (లడ్డు).ఈ సందర్భంగా రాష్ట్ర టీపీసీసీ మెంబర్ సీనియర్ నాయకుడు దరిపల్లి చంద్రం రవితేజ (లడ్డు) ను తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమాజానికి యువత సేవలు చాలా అవసరమని, యువత రాజకీయంగా ఎదగడమే కాకుండా తమ జాతి కోసం సమాజం కోసం పని చెయ్యాలని దరిపల్లి చంద్రం సూచించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అహల్యాబాయి ఆదర్శం

దుబ్బాక, మే31 (ఆంధ్రజ్యోతి): లోకమాత అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని శనివారం దుబ్బాకలో ఘనంగా నిర్వహించారు. దుబ్బాక పట్టణ బీజేపీ అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన జయంతి ఉత్సవానికి బీజేపీ మెదక్ పార్లమెంటు స్థాయి కో-కన్వీనర్ చింత సంతోష్‌గుప్త పాల్గొని మాట్లాడారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు


ఫర్టిలైజర్ దుకాణాదారుల సమావేశంలో మాట్లాడుతున్న తొగుట సీఐ లతీఫ్

దౌల్తాబాద్,మే 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఫర్టిలైజర్ దుకాణాదారులు నకిలీ విత్తనాలు,నకిలీ పురుగు మందులు కట్టబెడితే కఠిన చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ అన్నారు.శనివారం తొగుట సీఐ లతీఫ్, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి సత్య అన్వేష్, ఎస్సై శ్రీరామ్ ప్రేమ్‌దీప్‌తో కలిసి దౌల్తాబాద్ పోలిస్టేషన్ లో మండలంలోని ఫర్టిలైజర్ దుకాణా యాజమానులకు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ. ఫర్టిలైజర్ దుకాణా యాజమానులు ధరల పట్టికను స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, మందులు అమ్మినా, నాసి కరం విత్తనాలు, ఎరువులు, అమ్మినా లైసెన్స్‌లు రద్దు చేసి సదరు యాజమానులపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంమన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం నుండి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎన్సాన్‌పల్లి చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 9 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు.

చిన్నకోడూరు తహసీల్దార్‌గా సలీం

చిన్నకోడూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు తహసీల్దార్‌గా సలీం శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట అర్బన్‌లో తహసీల్దార్‌గా పనిచేసిన సలీం ఇక్కడికి బదిలీ పై వచ్చారు.